క్లుప్తంగా

పద్మశాలీ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పిఠాపురం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు చిన్నారావు

పిఠాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను పిఠాపురం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు తెడ్లపు చిన్నారావు ఆదివారం గొల్లప్రోలులో ఆవిష్కరించారు. గొల్లప్రోలు నగర పంచాయతీ వైస్ చైర్ పర్సన్ తెడ్లపు అలేఖ్యారాణి, తెడ్లపు నాగేంద్ర, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పద్మశాలీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కొండేటి వీరవెంకట సత్యనారాయణ, కసా వెంకటరమణ, వానపల్లి శివశంకర్, పందిరి అరుణాదేవి, పలకా సత్యనారాయణ, వానపల్లి సత్యవతి, , సుబ్రహ్మణ్యం, నేమాల రాంబాబు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రొంగల వీర్రాజు

పెద్దాపురం: వృద్ధ కళాకారులను ఆదుకునేందుకు ప్రతి నెలా రూ.5 వేల పింఛను ఇవ్వాలని ప్రజా నాట్యమండలి కార్యదర్శి రొంగల వీర్రాజు కోరారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం సీనియర్ కళాకారుడు ముసిడిపల్లి పుల్లారావు అధ్యక్షతన జరిగిన ప్రజానాట్య మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్లుగా కళాకారులకు రూ.3 వేలు మాత్రమే పింఛన్ ఇస్తున్నారన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల దృష్ట్యా వృద్ధ కళాకారులకు న్యాయం చేయాలన్నారు. కళాకారుడు మహపాతిన రాంబాబు, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవుని కృపతోనే సమాజ శాంతి



దివిలి చర్చిలో ప్రసంగిస్తున్న శామ్యూల్ సుదీప్

పెద్దాపురం: దేవుని కృపతోనే సమాజ శాంతి సాధ్యమని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు పాస్టర్ రెవరెండ్ నంగిన సత్యానందం అన్నారు. క్రీస్తు ఆరాధనల్లో భాగంగా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఆదివారం దివిలిలో ప్రేమవిందు ఆరాధన జరిగింది. ఈ సందర్భంగా క్రిష్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) అధ్యక్షుడు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన సభలో సత్యానందం మాట్లాడారు. ప్రభువు ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ప్రార్థనలు చేయాలన్నారు. అనంతరం సుమారు 1,500 మందికి ప్రేమవిందు ఏర్పాటు చేశారు. దైవజనులు వరప్రసాద్, అభిషేక్, మత ప్రబోధకులు నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, విశాల, మేరీ, శాంతివర్ధన విభిన్న ప్రతిభాంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, లక్కరాజు మున్నీస్వామి తదితరులు పాల్గొన్నారు. పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, సత్య దంపతులు విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులచే కేక్ కట్ చేయించారు.

7 నుంచి సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్

కరప: సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 7 నుంచి నిర్వహిస్తామని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ కరప (సీఏకే) అధ్యక్షుడు దేవు మధు వీరేష్ తెలిపారు. ఆదివారం కరపలో ఆయన మాట్లాడుతూ యాళ్ల వెంకట్రాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పేరిట పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 7వ తేదీ నుంచి నాకౌట్ విధానంలో పోటీలు జరుగుతాయన్నారు. దీనిలో మొదటి రెండు స్థానాలలో నిలిచే జట్లు మెయిన్ టోర్నీకి అర్హత సాధించి, ఆరు జట్లతో కలసి ఫైనల్ పోటీలలో తలపడతాయన్నారు. నాకౌట్ పోటీలు నక్కా భాస్కరమ్మ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నామన్నారు. దేవు సూర్యనారాయణమూర్తి (సూరిబాబు) జ్ఞాపకార్థం రూ 2 లక్షల విలువ చేసే గోల్డ్‌కప్ రోలింగ్ ట్రోఫీని విజేత జట్టుకు అందజేస్తామని సీఏకే అధ్యక్షుడు మధువీరేష్ తెలిపారు. టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరించి, పోటీలలో పాల్గొనే జట్లకు డ్రా తీసి, ఆయన వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నక్కా భీమ్, పోలిశెట్టి వాసు, శాకా శ్రీనివాస్, అడపా శ్రీనివాస్, పేకేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభిమానం..



ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు మొక్కతో శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్డీఓ రమణ

- ఎమ్మెల్యే దొరబాబు విజ్ఞప్తితో కొత్త ఒరవడి
- పుస్తకాలు, పెన్నులతో కార్యకర్తల శుభాకాంక్షలు
- వాడవాడలా నూతన సంవత్సర వేడుకలు
- రాజకీయ నాయకుల ఇళ్ల వద్ద సందడి



ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు పుస్తకాలు, పెన్నులతో శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు



సామర్లకోటలో దవులూరి దొరబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు తదితరులు

పిఠాపురం: తమ అభిమాన నేత పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు విశేషంగా బహుమతులు అందజేసి సేవా తత్పరులనిపించుకున్నారు. నూతన సంవత్సర వేడుకలతో కొంగొత్త అధ్యాయానికి నాంది పలకాలని, స్వీట్లు, బొకేలు, పళ్లు ఇస్తే ఆ రోజుకే ఉంటాయని తరువాత రోజు వాటి విలువ ఉండదని దొరబాబు పార్టీ క్యాడర్‌కు సూచించారు. అదే విధంగా వాటికోసం ఖర్చు చేసే ప్రతి పైసా విద్యార్థులకు, ఉద్యోగులకు తోడ్పడేలా ఉంటే మీ సేవ సార్థకమవుతుందని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన ప్రతి ఒక్కరు కేవలం పుస్తకాలు పెన్నులు, ప్యాడ్లు మొక్కలు తీసుకువచ్చి వారి పెద్దమనసు చాటుకున్నారు. దీంతో వేల మంది విద్యార్థులకు పంపిణీ చేసేందుకు వీలుగా పుస్తకాలు, పెన్నులు సమకూరాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే తన సిబ్బందిని ఆదేశించారు.

హ్యాపీ.. హ్యాపీగా..

సామర్లకోట: నూతన సంవత్సర వేడుకలను హ్యాపీ హ్యాపీగా జరుపుకొన్నారు. ఆదివారం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఈ సందడే కనిపించింది. సామర్లకోటలోని తన స్వగృహంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబును అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది తరలిరావడంతో సుమారు 20 వేల మందికి భోజన ఏర్పాట్లు చేశారు. అదే విధంగా అచ్చంపేటలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, పులిమేరులో జనసేన కన్వీనర్ తుమ్మల బాబు నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల రాజేశ్వరి, కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ దంపతులు వారి స్వగృహంలో కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్‌లు అభిమానుల మధ్య నూతన సంవత్సర సంబరాలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్‌ను మున్సిపల్ ఉద్యోగులు, కౌన్సిలర్లు కలసి శుభాకాంక్షలు తెలిపారు. వేట్లపాలెంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సామర్లకోటలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృతలు కేక్ కట్ చేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కొత్త సంవత్సరం ప్రారంభంతో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



సామర్లకోటలో సచివాలయ సిబ్బంది మధ్య కేక్ కట్ చేస్తున్న ఆవాల రాజేశ్వరి, కౌన్సిలర్ లక్ష్మీనారాయణ

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

కాకినాడ లీగల్: కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో సత్వరం పరిష్కరించుకోవచ్చని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం కమలాదేవి మాట్లాడుతూ చిన్న తగాదాల కారణంగా కేసులు పెట్టుకుని డబ్బును, మనశ్శాంతిని కోల్పోతున్నారన్నారు. ఇరువర్గాల పట్టుదలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 11న జరుగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులను పరిష్కరించుకోవడం ద్వారా స్నేహపూర్వక బంధం ఏర్పడుతుందన్నారు.

అలరించిన గాత్ర కచేరీ

కాకినాడ కల్చరల్: స్థానిక ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియలో సంస్థ 52వ వార్షికోత్సవ వేడుకలు, ధనుర్మాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆదివారం వేడుకలను సంస్థ అధ్యక్షుడు గోపాలనర్సరాజు ప్రారంభించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసుడు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులచే గాత్ర సంగీత కచేరీ నిర్వహించారు. అన్నమయ్య, త్యాగరాజు, రామదాసు, ముత్తుస్వామి దీక్షితార్ తదితర ప్రముఖ వాగ్గేయకారుల కీర్తనలు వివిధ రాగాలలో ఆలపించి అలరించారు. యువవాహిని సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు. సభ్యులు కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ, కుంజుక లక్ష్మి, తురుగా సూర్యారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందమని ‘పింఛేన్’



సామర్లకోటలో దివ్యాంగుడు రమణకు పింఛను ఇస్తున్న కౌన్సిలర్ రాజ్‌కుమార్, వలంటీర్ రోహిణి



పులిమేరులో పింఛను ఇస్తున్న సచివాలయ కన్వీనర్, వలంటీర్

పెద్దాపురం: కొత్త సంవత్సరం వేళ పింఛనుదారుల మోములో చిద్విలాసం కనిపించింది. సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్మును పెంచుతూ రూ.2,750 చొప్పున అందిస్తుండడంతో అంతా ఆనందం వ్యక్తం చేశారు. దీంతో వైఎస్సార్ పింఛను కానుక లబ్ధిదారుల్లో సంతోషం వెల్లివిరిసింది. మూడో విడత పింఛన్ పెంపులో భాగంగా రూ. 2,750కు పెంచి లబ్ధిదారులకు ప్రభుత్వం మేలు చేసిందని పలువురు అన్నారు. ఆదివారం వేకువ జాము నుంచే పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము పంపిణీని చేపట్టారు. ఆయా గ్రామ సచివాలయ సారథులు (కన్వీనర్లు), వలంటీర్లతో కలసి పింఛన్‌దారులకు సొమ్ము అందించడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

వేకువనే వచ్చి.. పింఛను ఇచ్చి

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలో ఆదివారం తెల్లవారు జామునే పింఛన్ల పంపిణీని చేపట్టారు. ఈ నెల నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛను సొమ్మును మరో రూ.250 పెంచి రూ. 2,750 చొప్పున అందిస్తున్నారు. సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. తాము నిద్రలేచే సమయానికి పింఛను సొమ్ము చేతిలో పడుతుందని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఆనందం వ్యక్తం చేశారు.

తొలిరోజు 80 శాతం పంపిణీ

కొత్తపల్లి: మండలంలోని ఆదివారం తెల్లవారు జాము నంచే అన్ని గ్రామాల్లో వలంటీర్లు పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం పెంచిన రూ.250తో కలిపి రూ.2750ను అందుకోవడంపై లబ్ధిదారులు వారి ఆనందాన్ని వ్యక్తం చేశారు. మొదటిరోజు 80 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ నందూరి ప్రభాకర రామారావు తెలిపారు. పింఛన్లు పంపిణీలో వలంటీర్లు నిర్లక్ష్యం వహించినా, అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతనంగా మంజూరైన 443 పింఛన్లు త్వరలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు చేతుల మీదుగా అందించనున్నట్లు తెలిపారు.



నాగులాపల్లిలో శివపావనికి పింఛను ఇస్తున్న దృశ్యం

కొంగొత్త ఆశలతో నూతన సంవత్సర వేడుకలు



ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు శుభాకాంక్షలు తెలిపేందుకు బారులు తీరిన అభిమానులు



వాకతిప్పలో మండల పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు



కోనపాపపేటలో ఎంపీపీ, కోఆప్షన్ సభ్యుడికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కొత్తపల్లి: నూతన సంవత్సర వేడుకలను మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. యువతీ, యువకులు కేక్‌లను కట్ చేసి శుభాకాంక్షలను తెలుపుకొన్నారు. కోనపాపపేటలో ఎంపీపీ కారే సుధ, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాస్ స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు, వలంటీర్లు, కార్యకర్తలు, మత్స్యకారులు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. వాకతిప్పలో మండల పార్టీ మండల అధ్యక్షుడు అనాల సుదర్శన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు జరిపారు. నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి గజమాలతో సత్కరించారు. మండల బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు గింజాల శ్రీనివాసరావు, వాకతిప్ప సర్పంచ్ పాలాని దొరబాబు, గోపి హరిబాబు, రాపర్తి శ్రీకృష్ణ శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. వాకతిప్పలో ఉన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావుకు తన కార్యాలయంలో మాజీ సర్పంచి కర్రి ఏసుబాబు, కుతుకుడుమిల్లి సర్పంచ్ కర్రి చిన్నారావు తదితరులు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్తపల్లిలో పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి దొరబాబు తన ఇంటి వద్ద న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నియోజకవర్గంలో వేడుకలు


పిఠాపురం: నియోజకవర్గంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని రాజకీయ పార్టీల నేతల ఇళ్లు, పార్టీ కార్యాలయాలు అభిమానులతో కిటకిటలాడాయి. స్థానిక రాజుగారి కోటలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో అభిమానులు నాయకులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకోగా, నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన అధికారులు వైఎస్సార్ సీపీ అభిమానులు నాయకులు కార్యకర్తలు పెండెం దొరబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఈఏడాది ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని కోరారు. టీడీపీ నేత మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ కార్యాలయం వద్ద నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరగగా వారికి అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు ఆయా శాఖల ఉన్నతాధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

దేవదేవుడు దిగివచ్చేవేళ..

- ఉత్తర ద్వార దర్శనానికి విష్ణాలయాలు సిద్ధం
- భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు



పిఠాపురంలో కుంతీమాధవస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు



పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయంలో నేడు తెరచుకోనున్న ఉత్తర ద్వారాలు



సామర్లకోటలో మాండవ్య నారాయణస్వామి ఆలయం

పిఠాపురం: ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం వైష్ణవాలయాల్లో గోవింద నామస్మరణ మార్మోగనుంది. స్వామివారి దర్శనానికి వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారాలు తెరిచి అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తిచేశారు. ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి నాడు విష్ణుమూర్తి వైకుంఠం నుంచి భువిపైకి వస్తాడని పురాణ గాథ. ఈ మేరకు ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉత్తర ద్వారాలను తెరచి భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

పంచమాధవ క్షేత్రాలలో ఒకటైన పిఠాపురంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు వైకుంఠద్వార దర్శనాలను ప్రారంభించి రాత్రి 9 గంటల వరకు కొనసాగిస్తారు. అలాగే శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనంతో పాటు దశావతారాల పూజ, నిత్యదేవతార్చనలు నిర్వహిస్తారు. కొత్తపల్లిలో కొలువైన ధర్మశాస్తా దేవస్థానంలోని వేంకటేశ్వరస్వామి సన్నిధి, స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలోనూ ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ఉప్పాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం పంచామృతాభిషేకం. శ్రీ లక్ష్మి వేంకటేశ్వర దేవాలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక అర్చనలు నిర్వహిచనున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

నేడు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

సామర్లకోట: ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ఉత్తర ద్వార దర్శనానికి ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక మాండవ్య నారాయణస్వామి ఆలయంలో స్వామి వారి దర్శనానికి ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. తెల్లవారు జామున మూడు గంటలకు క్షీరాభిషేకం, 4.30 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ అర్చకుడు రవి తెలిపారు. 14న ఆలయంలో గోదా కల్యాణం జరుగుతుందని, దీంతో ధనుర్మాస ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసినట్లు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి తెలిపారు.

పేదింట పెళ్లి బాజా..

- పేదల వివాహానికి ప్రభుత్వ సాయం
- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫాతో మేలు



వివాహ వేడుకలో వధూవరులు (ఫైల్)

పెద్దాపురం: పేదల ఇంట పెళ్లి బాజా మోగనుంది.. అంగరంగ వైభవంగా వేడుక జరిపేందుకు ప్రభుత్వం సాయం అందిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందనుంది. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నుంచి వివాహాలు జరిగిన యువతుల నుంచి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. ఇప్పటి వరకూ పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 29 దరఖాస్తులు అందాయని అధికారులు చెబుతున్నారు. దీనికి పెండ్లి కుమార్తెకు 18 ఏళ్లు, పెండ్లి కుమారునికి 21 ఏళ్ల వయసు వివాహ తేదీకి పూర్తయి ఉంటేనే అర్హులు. ఇద్దరూ పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇరు కుటుంబాలూ బీపీఎల్ కేటగిరీకి చెందాలి. 2022 అక్టోబర్ 1వ తేదీ నుంచి జరిగిన వివాహాలను పరిగణనలోకి తీసుకుంటారు. భవన, ఇతర నిర్మాణ రంగంలోని వారైతే పెండ్లి కుమార్తె గాని, ఆమె తల్లిదండ్రులు కానీ సంబంధిత వెల్ఫేర్ బోర్డులో నమోదు కావాల్సి ఉంది.

దరఖాస్తు చేసుకునే విధానం

వివాహం జరిగిన 60 రోజుల లోపు ఆయా గ్రామ సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలి. ఇందులో నిబంధనల మేరకు వివాహ ధ్రువీపత్రాలు దరఖాస్తులో పొందుపర్చాలి. ముఖ్యంగా పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల పెళ్లి పత్రికలు, పెళ్లి సమయంలో తీయించిన ఫోటోలు, వివాహ ధ్రువీకరణ పత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు పెండ్లి కుమార్తె బ్యాంకు ఖాతా జిరాక్సు కాపీ, వధూవరుల విద్యార్హతలను తెలిపే పత్రాలు జత చేయాలి. భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికులైతే కార్మిక సభ్యత్వ ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.

వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా సాయం ఇలా..

కులాలు	ఆర్థిక సాయం
ఎస్సీలు	రూ. లక్ష
ఎస్సీ కులాంతర వివాహం	రూ.1.20 లక్షలు
ఎస్టీ కులాంతర వివాహం	రూ.1.20 లక్షలు
బీసీలు	రూ. 50 వేలు
బీసీ కులాంతర వివాహం	రూ. 75 వేలు
దివ్యాంగులకు	రూ. 1.50 లక్షలు
భవన నిర్మాణ కార్మికులు	రూ. 40 వేలు

సద్వినియోగం చేసుకోవాలి



పేదల వివాహాలకు ఆర్థిక సాయం అందించేందుకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. కులాల వారీగా ఆర్థిక సాయంతో పాటు కులాంతర వివాహాల ప్రోత్సాహానికి అదనపు సాయం అందిస్తుంది. అర్హులు ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో వివాహ ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం.

–కేఎస్‌వీ ప్రసాదరావు,
డివిజన్ అభివృద్ధి అధికారి, పెద్దాపురం

విజయమే మన అ‘జెండా’

కాకినాడ: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే అజెండాగా శ్రేణులు సాగాలని, మన మద్దతుదారుల ఇళ్లపై పార్టీ జెండాలు ఎగురవేద్దామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా ఆయన నివాసం వద్ద నూతన సంవత్సర సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులకు పెద్ద ఎత్తున పార్టీ జెండాలు అందజేశారు. వివిధ డివిజన్ల నుంచి వచ్చిన కేడర్‌కు ఆయన జెండాలు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రతి కార్యకర్త పార్టీ కోసం మరింత కష్టించి పనిచేయాలని అన్నారు. మరో ఏడాది తరువాత ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచి నిత్యం ప్రజల మధ్యే ఉంటూ మమేకం కావాలని కోరారు. పేదల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలిపారు. అదే సమయంలో ప్రభుత్వంపై బురద జల్లుతున్న ప్రతిపక్షాలు, కొన్ని మీడియా సంస్థల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి ప్రతి ఇంటిపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా శ్రమిద్దామన్నారు.

బంధాలను బలపరిచేదే రామాయణం



విజేతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్

కాకినాడ కల్చరల్: భార్యాభర్తల అనుబంధాన్ని బలపర్చే మహా గ్రంథమే రామాయణమని సాహితీవేత్త గొట్టుముక్కల నరసింహశాస్త్రి అన్నారు. స్థానిక గాంధీభవన్‌లో సాంస్కృతిక, కళారంగ ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రామాయణంపై ప్రసంగ సభ జరిగింది. సుందరకాండపై గొట్టుముక్కల ప్రసంగించారు. సమాజంలో దంపతులు ఏవిధంగా ఉండాలో రామాయణం మనకు చెబుతోందని సభకు అధ్యక్షత వహించిన వేదిక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ అన్నారు. అనంతరం విద్యార్థులకు సుందరకాండపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఉత్తమ దంపతులను ఎంపిక చేసి వారికి ఆదర్శ దంపతుల పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా గంటి విశ్వనాథం, రాణీ బాలా త్రిపుర సుందరీ హాజరు కాగా ఆస్వాదన సమితి కన్వీనర్ గౌరీనాయుడు, మాకినీడి సూర్యభాస్కర్, శారద, ఉద్గళ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ: స్థానిక జెడ్పీ చైర్మన్ క్యాంప్ కార్యాలయంలో పీఆర్‌టీయూ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆదివారం ఆవిష్కరించారు. తొలుత ఆయనకు అసోసియేషన్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు చింతాడ ప్రదీప్‌కుమార్, ఏడుకొండలు, వాసంశెట్టి కామేశ్వరరావు, సింహాద్రి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.